Follow: @ANNTELUGU

REGISTERED NUMBER
APTEL/2014/58382

16-04-2026

ANN తెలుగు

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 109 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM




## చాపర్ ఎక్కుతా.. ప్లీజ్

*బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వింత సోకు*

మంత్రి పొన్నంకు ఊహించని అనుభవం!

మంత్రి వద్దన్నా వినకుండా హెలికాప్టర్ ఎక్కిన బీజేపీ ఎమ్మెల్యే


ఆదిలాబాద్ ఎయిర్‌డ్రోమ్ వద్ద హైడ్రామా

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమవుతున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హెలికాప్టర్ ను బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అనూహ్యంగా ఎక్కడం మంత్రిని షాక్ కు గురిచేసింది. సాధారణంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే రాజకీయ వాతావరణం ఉండే తరుణంలో, ఇద్దరు భిన్న ధృవాల నేతలు కలిసి ఒకే హెలికాప్టర్‌లో గగన విహారం చేయడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదిలాబాద్ పర్యటన ముగించుకుని ఎయిర్‌డ్రోమ్ వద్దకు చేరుకోగా, అక్కడకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా వచ్చారు. మంత్రి తన హెలికాప్టర్ ఎక్కుతుండగా, ఎమ్మెల్యే కూడా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. భద్రతా కారణాల దృష్ట్యా, రాజకీయ సమీకరణాల దృష్ట్యా మంత్రి పొన్నం ఆయనను వారించినప్పటికీ పాయల్ శంకర్ వినలేదు.

మిగతా 2లో

టాప్ న్యూస్

### టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్



- పొలిట్ బ్యూరో సహా కీలక కమిటీలు వేసిన చంద్రబాబు

02

### బీహార్‌లో 'సామ్రాట్' శకం మొదలు!



- హోం సహా 29 శాఖలు తన వద్దే ఉంచుకున్న కొత్త సీఎం
- ఉప ముఖ్యమంత్రులుగా జేడీయూ నేతలు విజయ్ చౌధరీ, బిజేంద్ర ప్రసాద్

02

### సామాన్యుడికి 'పెట్రో' వాత తప్పదా?



- రోజుకు రూ. 1600 కోట్ల నష్టాల్లో చమురు సంస్థలు
- అంతర్జాతీయ మార్కెట్లో పెరుగుతున్న ముడిచమురు ధరలు
- ధరల పెంపునకు రంగం సిద్ధం చేస్తున్న కంపెనీలు

02

# డీ.. లిమిటేషన్

*దక్షిణాదికి శిక్ష.. భగ్గుమంటున్న సౌత్ స్టేట్స్*

**మోదీ దేశద్రోహ చర్యలు.. రాహుల్ ధ్వజం**

అందరినీ సంప్రదించాకే నిర్ణయం తీసుకుంటాం కేంద్రం

దక్షిణ భారత్ అంటూ బలమైన ప్రజా ఉద్యమం బీఆర్ఎస్ వార్నింగ్

మన తలలపై వేలాడుతున్న కత్తి మనపైనే పడింది.. డీలిమిటేషన్‌పై స్టాలిన్ ఫైర్

నేటి నుండి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

**(ఢిల్లీ-మహా)**

డీలిమిటేషన్ బిల్లుపై సౌత్ స్టేట్స్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గాల పెంపుతో సౌత్ ను పూర్తిగా పక్కనపెట్టడమేనని సౌత్ స్టేట్స్ సీఎంలతో పాటు ప్రాంతీయపార్టీలు తీవ్ర ఆగ్రహం ప్రదర్శిస్తున్నాయి. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం గురువారం దానిని లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ ఈ బిల్లును సభ ముందుకు తీసుకురానున్నారు. అనంతరం బిల్లుపై చర్చ జరగనుంది. ఇప్పుడున్న లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని బిల్లులో కేంద్రం ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్య 815గానూ, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. ఇప్పటివరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉంది. కానీ ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై చర్చ ముదురుతున్న కొద్దీ, భారతీయ జనతా పార్టీ దక్షిణాది రాష్ట్రాల నుండి ప్రతిఘటనను ఎదుర్కొంటోంది. ఈ అంశం వారి మధ్య రాజకీయ విభేదాలను మరింత పెంచుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**సౌత్‌లో ఉత్తరాది పార్టీ ముద్ర**

బిజెపికి వింధ్య పర్వతాలు ఒక రాజకీయ విభజన రేఖగా మారుతున్నాయి. దీనివల్ల దక్షిణాదిలో ఆ పార్టీ కేవలం "ఉత్తరాది పార్టీ"గా ముద్రపడే అవకాశం ఉందనే భయాలు నెలకొన్నాయి. , గుజరాత్ నుండి బీహార్ వరకు విస్తరించి ఉన్న వింధ్యాచల్ పర్వత శ్రేణులు భౌగోళికంగా, శీతోష్ణస్థితి పరంగా మరియు సాంస్కృతికంగా ఉత్తరాదిలోని గంగా మైదానాలను, దక్షిణాదిలోని దక్కన్ పీఠభూమిని వేరుచేసే ప్రధాన సరిహద్దుగా ఉంటూ వస్తున్నాయి.

మిగతా 2లో



### దక్షిణ భారత్

తెలంగాణలోని ప్రతిపక్ష పార్టీ భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) కూడా ఈ విషయంలో గట్టి వైఖరిని అవలంబించింది. ఈ చర్య "దక్షిణ భారత్ అంతటా బలమైన ప్రజా ఉద్యమానికి" దారితీయవచ్చని ఆ పార్టీ నేత కేటీఆర్ హెచ్చరించారు. రాజకీయ ప్రాబల్యం తగ్గితే దక్షిణాది సమాజం "మూగ ప్రేక్షక పాత్ర" వహించదని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మాత్రం ఇందుకు మినహాయింపుగా నిలిచింది. పునర్విభజనలో న్యాయం జరగాలని కోరుతూనే, ఎన్‌డిఏ భాగస్వామిగా ఉన్న టీడీపీ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో నేరుగా ఘర్షణ పడకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. తమిళనాడులో అధికార డీఎంకే ఈ అంశాన్ని తన ద్రావిడ మరియు బిజెపి వ్యతిరేక వాదాన్ని బలోపేతం చేయడానికి వాడుకుంటోంది. లెఫ్ట్ ప్రభుత్వం ఉన్న కేరళలో, ఈ వివాదం బిజెపి రాజకీయ విస్తరణను మరింత అడ్డుకునే అవకాశం ఉంది. పుదుచ్చేరిలో కూడా ఈ అంశం ఎన్‌డిఏ లోపల అంతర్గత ఒత్తిడిని కలిగించవచ్చు. స్టాలిన్, రేవంత్ రెడ్డి, పినరయి విజయన్ వంటి ప్రభావవంతమైన నాయకులు కఠిన వైఖరిని తీసుకోవడం, టీడీపీ సమతుల్యతను పాటించడంతో.. పునర్విభజన అంశం కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఒక కీలక రాజకీయ పరీక్షగా మారింది.



### మోదీ దేశద్రోహ చర్యలు

- దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం
- మహిళా బిల్లుకు మా మద్దతు.. కానీ కుట్రలను సహించం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

వివరాలు 2లో



## యుద్ధం చాలా త్వరగానే ముగుస్తుంది

*డొనాల్డ్ ట్రంప్ ప్రకటన*

**మహా:** తాము ఇరాన్ యుద్ధాన్ని ముగించిన వెంటనే ముడి చమురు ధరలు చాలా భారీగా తగ్గిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. నవంబరులో అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నికలు జరిగే నాటికి ఇంధన ధరలు దాదాపుగా ఇప్పటి స్థాయిలోనే, లేదంటే కొంత ఎక్కువ స్థాయిలో ఉంటాయని ఆయన తెలిపారు.

మిగతా 2లో



## సిద్ధూ చెవిలో.. మోదీ

**కర్నాటకంలో కొత్త వ్యూహం**

**బెంగళూరు, మహా:** ప్రస్తుత రాజకీయాలు ఒక పట్టాన ఎవరికీ అందవు. ఒకవైపు ఆధ్యాత్మికత, మరోవైపు కుంభకోణాల ఆరోపణలు, ఇంకోవైపు కుర్చీలాట.. ఈ మూడింటి కలయికగా దక్షిణ భారతం ఇప్పుడు రాజకీయ రణక్షేత్రంగా మారింది. ప్రధానంగా బెంగళూరు విమానాశ్రయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అత్యంత సన్నిహితంగా, ఒకరి చెవిలో ఒకరు మాట్లాడుకుంటున్న ఫోటో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడమే కాకుండా, అనేక రాజకీయ విశ్లేషణలకు తావిస్తోంది.

మిగతా 2లో

### రైతులకు మద్దతుగా

# కవిత రణం

ఆర్డీవో కార్యాలయం ముట్టడి

భూసేకరణ నిరసిస్తూ రైతులతో కలిసి బైఠాయింపు.. పరిగిలో ఉద్రిక్తత




**వికారాబాద్, మహా:** వికారాబాద్ జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల పోరాటం ఉగ్రరూపం దాల్చింది. బుధవారం పరిగి ప్రాంతం పోలీసులకు, రైతులకు మధ్య జరిగిన తోపులాటలతో ఒక్కసారిగా రణరంగంగా మారింది. తమ సారవంతమైన భూములను పరిశ్రమల కోసం వదులుకోవడానికి సిద్ధంగా లేమని గత కొన్ని రోజులుగా ఆందోళన బాట పట్టిన రైతులకు మద్దతుగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రంగంలోకి దిగడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. పరిగి ఆర్డీవో కార్యాలయం ముట్టడికి యత్నించిన కవితను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి తరలించారు.

మిగతా 2లో

### ఫాతిమా ఓవైసీ కళాశాల కూల్చివేతకు

# రంగం సిద్ధం?

- అక్రమ కట్టడాలపై అధికారుల గురి
- ఎమ్మెల్యే రాజా సింగ్ సంచలన వ్యాఖ్యలు
- కొత్త ప్రవేశాలు చేపట్టవద్దన్న హైకోర్టు
- విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచన




**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లోని సల్కం చెరువు ప్రాంతంలో అక్రమంగా నిర్మించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాతిమా ఓవైసీ కళాశాలను అధికారులు ఏ క్షణంలోనైనా కూల్చివేసే అవకాశం ఉందని గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెరువు శిఖం భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇటువంటి కట్టడాల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించబోతున్నారని ఆయన పేర్కొన్నారు. బుధవారం సల్కం చెరువు పరిసర ప్రాంతాల్లోని ఆక్రమణల పరిస్థితిని ప్రస్తావిస్తూ, సదరు కళాశాల మనుగడపై ఆయన కీలక హెచ్చరికలు జారీ చేశారు.

మిగతా 2లో



### వడదెబ్బ బాధితులకు

## సత్వరమే చికిత్స

- ప్రతి దవాఖానలో ప్రత్యేక వైద్య బృందం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- ఎండల తీవ్రతపై ఆరోగ్యశాఖ సమీక్ష

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్యశాఖ యంత్రాంగం అప్రమత్తమైంది. వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స అందించాలని, ఇందుకోసం ప్రతి ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఒక వైద్య బృందాన్ని సిద్ధంగా ఉంచాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ఎండల తీవ్రత, ఆస్పత్రుల్లో సౌకర్యాలు, అగ్ని ప్రమాదాల నివారణపై ఆయన ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు.

మిగతా 2లో

## తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్

*3 రోజులు మాడు పగిలే ఎండలు.. ఏకంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు*

**హైదరాబాద్, మహా :** భానుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. రోజురోజుకూ ఎండల తాకిడి పెరుగుతోంది. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రతకు జనం బయటికి రాలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు బయట తిరగొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. సాధారణం కంటే అధికంగా ఎండలు ఉండటంతో జనం మధ్యాహ్నం పూటే బయటికి రావాలంటే భయపడుతున్నారు. తాజాగా వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలు తెలంగాణ ప్రజలను మరింత భయాందోళనలకు గురి చేస్తున్నాయి. రాష్ట్రంలో రానున్న మూడ్రోజుల పాటు ఉష్ణోగ్రతలు పెరగనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠంగా 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.



మిగతా 2లో

## పదవుల జాతరకు లైన్ క్లియర్

**సీఎంతో మీనాక్షి, పీసీసీ చీఫ్ భేటీ.. రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వంపై పట్టు పెంచుకుంటూనే, మరోవైపు పార్టీలో అసమ్మతి సెగలను చల్లార్చేందుకు అధిష్ఠానం రంగంలోకి దిగింది. బుధవారం గాంధీ భవన్ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో జరిగిన హైలెవల్ మీటింగ్ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌లతో కలిసి ఆమె సుమారు మూడు గంటల పాటు మారథాన్ సమీక్ష నిర్వహించారు. మంత్రుల పనితీరు, వారిపై వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలు, సీనియర్ నేత జీవన్ రెడ్డి రాజీనామా ఉదంతం వంటి సున్నితమైన అంశాలపై ఈ భేటీలో లోతైన చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పార్టీ ప్రతిష్టకు భంగం కలగకుండా అసంతృప్త నేతలను ఎలా బుజ్జగించాలనే అంశంపై మీనాక్షి నటరాజన్ కీలక దిశానిర్దేశం చేశారు.

**నామినేటెడ్ పదవులకు రూట్ క్లియర్**

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపై ఈ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు, ద్వితీయ శ్రేణి నాయకులకు సముచిత స్థానం కల్పించాలనే డిమాండ్‌పై ఆయన సానుకూలంగా స్పందించారు. సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేస్తూ, అన్ని వర్గాలకు న్యాయం

మిగతా 2లో

# ఢీ.. లిటిగేషన్

(మొదటిపేజీ తరువాయి)

జనాభా ప్రాతిపదికన జరిగే పునర్విభజన వల్ల జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకే అన్యాయమైన ప్రయోజనం చేకూరుతుందని దక్షిణాది రాష్ట్రాల నాయకులు వాదిస్తున్నారు. అదే సమయంలో, జనాభా నియంత్రణ మరియు అభివృద్ధిలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన రాష్ట్రాలను ఇది శిక్షిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. చివరిగా ప్రచురించబడిన జనాభా గణన ఆధారంగా చేపట్టే పునర్విభజన ప్రక్రియ తర్వాత, 2029 పార్లమెంటు ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలులోకి తీసుకురావడానికి లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుండి 850 వరకు పెంచనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వారం ఆరంభంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రణాళికపై కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తొలిసారిగా ఘాటైన రాజకీయ విమర్శలు చేశారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పెంచడం వల్ల జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలను "శిక్షించినట్లు" అవుతుందని ఆయన 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులందరూ ఏకతాటిపైకి రావాలని కోరుతూ ఆయన వారికి లేఖలు కూడా రాశారు. రేవంత్ రెడ్డి పునర్విభజన కోసం ఒక 'హైబ్రిడ్ నమూనా'ను ప్రతిపాదించారు. దీని ప్రకారం సగం సీట్లను జనాభా ప్రాతిపదికన, మిగిలిన సగం సీట్లను ఆర్థిక పనితీరు ఆధారంగా కేటాయించాలని సూచించారు. ప్రధాని మోదీని నేరుగా లక్ష్యం చేసుకుంటూ, దక్షిణాది ఆందోళనలను విస్మరిస్తే "తీవ్ర ప్రతిఘటన" తప్పదని హెచ్చరించారు. మరోవైపు అందరినీ సంప్రదించే నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

### వైఫల్యానికి బహుమతి.. పురోగతికి శిక్ష

బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ వెలుపల ఉన్న దక్షిణాది నేతలు.. పునర్విభజన వల్ల ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలకు సీట్లు భారీగా పెరుగుతాయని, అదే సమయంలో తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలకు స్వల్పంగా మాత్రమే పెరుగుతాయని వాదిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ, అభివృద్ధిలో మెరుగైన ఫలితాలు సాధించాయని పేర్కొంటూ, ప్రస్తుత ప్రతిపాదనను "వైఫల్యానికి బహుమతి ఇవ్వడం, పురోగతిని శిక్షించడం"గా వారు అభివర్ణిస్తున్నారు. ఈ వివాదం తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వంటి నేతలను ఏకం చేసింది. వీరంతా రేవంత్ రెడ్డి వ్యక్తం చేసిన ఆందోళనలను సమర్థించారు. ప్రతిపాదిత పునర్విభజనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త 'నల్లజెండాల నిరసన'ను స్టాలిన్ బుధవారం ప్రకటించారు. తమిళనాడు గళాన్ని వినకపోతే కేంద్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

### విభజన పద్ధతిపై నేడు స్పష్టత

లోక్‌సభ సీట్లను 850కి ఏ ప్రాతిపదికన పెంచుతున్నారనే విషయాన్ని బిల్లులో కేంద్రం స్పష్టంగా చెప్పలేదు. పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50 శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ నివేదిక ఇచ్చే వరకూ ఏ రాష్ట్రంలో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తిని కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ లేదా ఆయన ప్రతినిధి ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు కూడా ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. ఈ కమిషన్ దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. అందుబాటులో ఉన్న జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది డిలిమిటేషన్ కమిషన్ నిర్ణయిస్తుంది. రాష్ట్రాల వారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

# బీహార్‌లో సామ్రాట్ శకం మొదలు!

**హోం సహా 29 శాఖలు తన వద్దే ఉంచుకున్న కొత్త సీఎం**

**ఉప ముఖ్యమంత్రులుగా జేడీయూ నేతలు విజయ్ చౌధరీ, బిజేంద్ర ప్రసాద్**

**పాట్నా, మహా:** బీహార్ రాజకీయాల్లో సుదీర్ఘకాలం సాగిన 'నీతీశ్ యుగం' ముగిసి 'సామ్రాట్ శకం' ప్రారంభమైంది. బీహార్ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమ్రాట్ చౌధరీ, పరిపాలనపై తన పట్టును చాటుకుంటూ అత్యంత కీలకమైన హోం మంత్రిత్వ శాఖతో పాటు మొత్తం 29 శాఖలను తన వద్దే ఉంచుకున్నారు. బుధవారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మంత్రులకు శాఖలు కేటాయిస్తూ కేబినెట్ సచివాలయ విభాగం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ కొత్త ప్రభుత్వంలో జేడీయూ నేతలకు ఉప ముఖ్యమంత్రి పదవులు దక్కాయి. విజయ్ కుమార్ చౌధరీ, బిజేంద్ర ప్రసాద్ యాదవ్ ఉప ముఖ్యమంత్రులుగా నియమితులై కీలక బాధ్యతలను స్వీకరించారు.

**అన్ని కీలక శాఖలపై సీఎం 'సామ్రాట్' పట్టు**

ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ ప్రస్తుతం హోం, విజిలెన్స్, రెవెన్యూ, భూసంస్కరణలు, ఆరోగ్యం వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖలను తన వద్దే ఉంచుకున్నారు. దీని ద్వారా రాష్ట్ర భద్రత, పోలీసు పరిపాలన మరియు చట్టవ్యవస్థపై ఆయనకు పూర్తి స్థాయి పట్టు ఏర్పడింది. వీటితో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, పంచాయతీరాజ్, కార్మిక వనరులు, విపత్తు నిర్వహణ వంటి మొత్తం 29 శాఖలను ఆయన స్వయంగా పర్యవేక్షించనున్నారు. ఇంకా ఏ మంత్రికీ కేటాయించని ఇతర శాఖలు కూడా ముఖ్యమంత్రి పరిధిలోనే ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ భారీ స్థాయిలో శాఖలను తన వద్దే ఉంచుకోవడం ద్వారా రాష్ట్రంలో కేంద్రీకృత పాలనకు ఆయన పునాదులు వేసినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**డిప్యూటీ సీఎంలకు కీలక బాధ్యతలు**

కూటమి సమతుల్యతను పాటిస్తూనే ఉప ముఖ్యమంత్రులకు కీలక బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. సీనియర్ నేత విజయ్ కుమార్ చౌధరీకి జలవనరులు, పార్లమెంటరీ వ్యవహారాలు, సమాచార మరియు ప్రజా సంబంధాల శాఖలతో సహా మొత్తం 10 శాఖలను కేటాయించారు. ఆయన గతంలో కూడా నీతీశ్ కుమార్ ప్రభుత్వంలో ఇవే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. మరో ఉప ముఖ్యమంత్రి బిజేంద్ర ప్రసాద్ యాదవ్‌కు ఎనిమిది శాఖలను అప్పగించారు. వీటిలో అత్యంత కీలకమైన ఆర్థిక శాఖతో పాటు ఇంధనం, ప్రణాళిక మరియు అభివృద్ధి, ఎక్సైజ్ శాఖలు ఉన్నాయి. పరిపాలనలో అనుభవం ఉన్న వీరిద్దరికీ ప్రాధాన్యత కలిగిన శాఖలు దక్కడం గమనార్హం.

**బీజేపీ వ్యూహం.. చారిత్రాత్మక విజయం**

2025 అసెంబ్లీ ఎన్నికల్లో 89 సీట్లతో బీజేపీ ఏకైక పెద్ద పార్టీగా అవతరించడం, నీతీశ్ కుమార్ రాజ్యసభకు ఎన్నికై సీఎం పదవికి రాజీనామా చేయడంతో బిహార్‌లో బీజేపీ స్వయంగా ప్రభుత్వాన్ని నడపాలనే దీర్ఘకాల వ్యూహం ఫలించింది. జేడీయూ నుంచి బీజేపీలో చేరిన సామ్రాట్ చౌధరీ, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. నీతీశ్ కుమార్ 10వ సారి రికార్డు స్థాయిలో ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ, మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బీజేపీ హైకమాండ్ రాష్ట్ర పగ్గాలను సామ్రాట్ చౌధరీకే అప్పగించింది. జేడీయూను సమన్వయం చేసుకుంటూనే బీజేపీ తన ప్రాబల్యాన్ని పెంచుకునేలా ఈ శాఖల కేటాయింపులు జరిగినట్లు స్పష్టమవుతోంది.

**టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా**

# నారా లోకేష్

**పొలిట్ బ్యూరో సహా కీలక కమిటీలు వేసిన చంద్రబాబు**

అమరావతి, మహా : తెలుగుదేశం పార్టీలో సంస్థాగత మార్పులకు శ్రీకారం చుడుతూ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడం, ఆధునిక విధానాలతో ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్‌ను నియమించారు. యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తూ, పార్టీ కార్యకలాపాలను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా, కాకినాడ జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. పార్టీ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, అనుభవాన్ని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తమను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు సానా సతీష్ బాబు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి శ్రమిస్తానని పేర్కొన్నారు. అలాగే, నారా లోకేష్‌ను జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం పట్ల సానా సతీష్ బాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# చాపర్ ఎక్కుతా.. ప్లీజ్

*బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వింత సోకు*

(మొదటిపేజీ తరువాయి)

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్ వివాదంపై గత కొన్ని రోజులుగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో, భూములను విహంగ వీక్షణం ద్వారా పరిశీలించాల్సిందేనని ఆయన పట్టుబట్టారు. పొన్నం జిల్లా మంత్రి కాదు.. ఆ శాఖతో కూడా సంబంధం లేదు. కానీ పాయల్ శంకర్ ఆదిలాబాద్ టౌన్‌లో గగనవిహారం చేయాలన్న కోరికతో మంత్రిపై ఒత్తిడిచేయడంతో చేసేది లేక మంత్రి ఆయనను తనతో పాటు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై అధికారుల బృందాలను పంపిస్తామని ప్రకటించారు. ఈ హఠాత్పరిణామంతో మంత్రి పొన్నం ప్రభాకర్ వింత అనుభవాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.

**కాంగ్రెస్ నాయకుల గుర్రు.. రాజకీయ దుమారం**

ప్రభుత్వ అధికారిక పర్యటనలో ఉన్న మంత్రి హెలికాప్టర్‌లోకి ప్రతిపక్ష ఎమ్మెల్యే బలవంతంగా ఎక్కి ప్రయాణించడంపై కాంగ్రెస్ శ్రేణులు మండిపడుతున్నాయి. ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కి బీజేపీ ఎమ్మెల్యే హైడ్రామా సృష్టించారని స్థానిక కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పనులు చేపడుతుంటే, క్రెడిట్ కోసం బీజేపీ నేతలు ఇలాంటి 'వింత' చేష్టలకు పాల్పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. పాయల్ శంకర్ తీరుతో బిజెపి శ్రేణులు కూడా విస్తుపోతున్నాయి.

# రైతులకు మద్దతుగా కవిత రణం



(మొదటిపేజీ తరువాయి)

ఈ క్రమంలో చోటుచేసుకున్న పరిణామాలు జిల్లా కేంద్రంలో పెను ఉత్కంఠకు దారితీశాయి. వందలాది మంది రైతులతో కలిసి ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించేందుకు కవిత ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య గంటల తరబడి తోపులాట చోటుచేసుకుంది. ఎన్టీఆర్ చౌరస్తా వద్ద పరిస్థితి చేయి దాటిపోతుండటంతో పోలీసులు కవితను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. అయితే జాగృతి కార్యకర్తలు, రైతులు పోలీసులను అడ్డుకోవడంతో అక్కడ తీవ్ర హైడ్రామా నెలకొంది. చివరకు పోలీసులు కవితను బలవంతంగా వాహనం నుంచి కిందకు దించి, పోలీసు వాహనంలో వేరే ప్రాంతానికి తరలించారు. ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య తోపులాట జరగడంతో కొందరు రైతులు స్వల్పంగా గాయపడ్డారు. అరెస్టుకు ముందు కవిత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. రైతుల పొట్ట కొట్టి పరిశ్రమలు కట్టడం ఏంటని ఆమె నిలదీశారు. అన్నదాతలు ప్రాణాలకు తెగించి తమ సాగు భూములను కాపాడుకుంటుంటే, వారిపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల భూములు కాపాడే వరకు తమ పోరాటం ఆగదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం కవిత అరెస్టుతో వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. కవితను తరలించిన సమాచారంతో జాగృతి శ్రేణులు ఎక్కడికక్కడ రాస్తారోకోలు చేపట్టడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా కేంద్రంలో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ప్రభుత్వ భూసేకరణ నిర్ణయంపై రైతుల్లో వ్యక్తమవుతున్న ఆగ్రహం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకోవడంతో, ఈ వివాదం మున్ముందు మరెన్ని మలుపులు తిరుగుతుందోనన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది.

# సిద్ధూ చెవిలో.. మోదీ

(మొదటిపేజీ తరువాయి)

వీరిద్దరి మధ్య నవ్వుల వెనుక 'నమ్మకం' ఉందా లేక 'రాజకీయ చదరంగం' ఉందా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.

**సమాఖ్య మర్యాదా? రాజకీయ వ్యూహమా?**

విమానాశ్రయంలో ప్రధాని మోదీకి సిద్ధరామయ్య స్వాగతం పలికిన దృశ్యం పైన చూడటానికి ప్రోటోకాల్‌లా ఉన్నా, లోపల మాత్రం లోతైన అర్థాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధుల విషయంలో కేంద్రంపై పోరాడుతున్న తరుణంలో, ప్రధాని మోదీ సిద్ధరామయ్యతో ఏకాంతంగా చర్చించడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఢిల్లీలో 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మకాం వేసి, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ కోసం ఒత్తిడి తెస్తున్న సమయంలో ఈ భేటీ జరగడం గమనార్హం. సిద్ధరామయ్య తన కుర్చీని కాపాడుకునేందుకు, డీకే శివకుమార్ వర్గాన్ని కట్టడి చేసేందుకు కేంద్రం సాయం కోరుతున్నారా? లేక ప్రధాని మోదీ కన్నడ గడ్డపై కాంగ్రెస్ బలహీనతలను ఆసరాగా చేసుకుని తనదైన శైలిలో పావులు కదుపుతున్నారా? అన్నది చర్చనీయాంశం.

**కాంగ్రెస్ 'అంతర్గత' పోరు.. ఢిల్లీ చేరిన సెగలు**

కర్ణాటక కాంగ్రెస్‌లో ముసలం పుట్టింది. 30 మంది ఎమ్మెల్యేలు మంత్రులపై అసంతృప్తితో ఢిల్లీలో తిష్ట వేయడం, నాయకత్వ మార్పు డిమాండ్లు వినిపించడం సిద్ధరామయ్య ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ తన వర్గాన్ని అప్రమత్తం చేయడం, చివరి నిమిషంలో కొందరు ఎమ్మెల్యేల ఢిల్లీ పర్యటనను రద్దు చేయించడం చూస్తుంటే.. కర్ణాటకలో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇద్దరు అగ్రనేతల మధ్య ఆధిపత్య పోరు చివరకు ఎవరికి లాభిస్తుందోనని హైకమాండ్ తల పట్టుకుంటోంది.

**ఆదిచుంచనగిరి వేదికగా 'వొక్కలిగ' సమీకరణం**

మాండ్యా జిల్లాలోని ఆదిచుంచనగిరి మఠాన్ని ప్రధాని మోదీ సందర్శించడం వెనుక స్పష్టమైన సామాజిక లెక్క ఉంది. కర్ణాటక రాజకీయాలను శాసించే వొక్కలిగ సామాజిక వర్గానికి ఈ మఠం అత్యంత పవిత్రమైనది. జేడీఎస్ అధినేత దేవెగౌడ, కేంద్ర మంత్రి కుమారస్వామిలతో కలిసి మోదీ వేదికను పంచుకోవడం ద్వారా.. భాజపాజేడీఎస్ కూటమి వొక్కలిగ ఓటు బ్యాంకుపై పట్టు సాధించే ప్రయత్నం చేసింది. ఆధ్యాత్మిక ముసుగులో సాగిన ఈ పర్యటన పాత మైసూరు ప్రాంతంలో కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ తీసేలా కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే, ప్రధాని మోదీ తన పర్యటన ద్వారా అటు ఆధ్యాత్మిక సందేశాన్నిస్తూనే ఇటు రాజకీయంగా 'వొక్కలిగ'లను ఆకట్టుకున్నారు. కాంగ్రెస్ తన సొంత ఎమ్మెల్యేల అసమ్మతితో సతమతమవుతుంటే, ప్రత్యర్థి పార్టీలు కుంభకోణాల ఫిర్యాదులతో వారిని డిఫెన్స్‌లోకి నెట్టేస్తున్నాయి. సిద్ధరామయ్యమోదీ రహస్య మంతనాలు కేవలం మర్యాదపూర్వకమేనా లేక ఏదైనా 'పొలిటికల్ రీఅలైన్‌మెంట్'కు సంకేతమా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. ప్రస్తుతం దక్షిణ భారత రాజకీయాల్లో 'చెక్ అండ్ మేట్' గేమ్ నడుస్తోంది!

# వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స

(మొదటిపేజీ తరువాయి)

బాధితులు ఆస్పత్రికి వచ్చిన వెంటనే చికిత్స ప్రారంభించేలా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

**రోగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు**

ప్రభుత్వ దవాఖానలకు వచ్చే అవుట్ పేషెంట్లు, ఇన్‌పేషెంట్లు మరియు వారి సహాయకులకు ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. పెద్ద హాస్పిటల్స్‌లో ప్రతి బ్లాక్ మరియు ప్రతి ఫ్లోర్‌లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఆవరణల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వార్డుల్లో ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని, ఐసీయూ వంటి కీలక విభాగాల్లో ఏసీలు సక్రమంగా పనిచేసేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే రోగులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని, వాటి పనితీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు.

**అవగాహనతోనే నివారణ సాధ్యం**

వడదెబ్బ నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను కోరారు. ముఖ్యంగా ఎండలో శ్రమించే ఉపాధి హామి కూలీలు, రైతులు, ఆటో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ వంటి గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని సూచించారు. బస్ స్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సోషల్ మీడియా ద్వారా జాగ్రత్తలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లినప్పుడు నీటిని వెంట తీసుకెళ్లాలని, ఏదైనా అసౌకర్యం కలిగితే తక్షణమే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తం**

వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే ముప్పు ఎక్కువగా ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి అప్రమత్తం చేశారు. షార్ట్ సర్క్యూట్లు జరగకుండా ఆస్పత్రుల్లోని పవర్ కేబుల్స్‌ను తనిఖీ చేయాలని, అవసరమైన చోట కొత్త వైరింగ్ చేయించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో ఫైర్ అలారమ్స్, స్మోక్ డిటెక్టర్స్ పనితీరుపై మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, మంటలను ఆర్పే యంత్రాల గడువు తేదీలను సరిచూసుకోవాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాల్లో స్మోకింగ్, డ్రింకింగ్ వంటి చర్యలను ఉపేక్షించవద్దని, సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై తగిన శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పదవుల జాతరకు లైన్ క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

జరిగేలా కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. మరో రెండు, మూడు రోజుల్లోనే నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉండటంతో ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ బలోపేతానికి ఈ నియామకాలు టానిక్‌లా పనిచేస్తాయని, ముఖ్యంగా జిల్లా స్థాయి పదవుల భర్తీతో క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు బిగిస్తుందని అధినాయకత్వం భావిస్తోంది.

**68వ సారి ఢిల్లీ బాట.. 'ఇండియా' కూటమిలో రేవంత్ కీలకం**

రాష్ట్రంలో సమీక్ష ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ పర్యటనకు సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇది ఆయనకు 68వ ఢిల్లీ పర్యటన కావడం విశేషం. నియోజకవర్గాల పునర్విభజన మరియు మహిళా రిజర్వేషన్ల అంశంపై జాతీయ స్థాయిలో ఇండియా కూటమి నిర్వహించే అత్యంత కీలకమైన సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టంపై గళమెత్తాలని, కూటమి నేతలతో కలిసి ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించాలని రేవంత్ యోచిస్తున్నారు. ఈ పర్యటనలో ఏఐసీసీ అగ్రనేతలతో కూడా ఆయన ప్రత్యేకంగా భేటీ అయి రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలను వివరించే అవకాశం ఉంది.

***20న భూపాలపల్లికి సీఎం.. పుష్కర ఏర్పాట్లపై సమీక్ష***

పాలనలో తనదైన ముద్ర వేస్తున్న రేవంత్ రెడ్డి, ఈ నెల 20న భూపాలపల్లి జిల్లా పర్యటనకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో వివాదాస్పదంగా మారిన మేడిగడ్డ బ్యారేజీని ఆయన స్వయంగా సందర్శించనున్నారు. అక్కడ ప్రస్తుతం కొనసాగుతున్న జియో ఫిజికల్ పరీక్షలు, పునరుద్ధరణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయనున్నారు. వీటితో పాటు కాళేశ్వరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'సరస్వతి అంత్య పుష్కరాల' ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. అటు పార్టీ వ్యవహారాలను చక్కదిద్దుతూనే, ఇటు పాలనాపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ రేవంత్ రెడ్డి దూకుడు పెంచడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది.

# మోదీ దేశద్రోహ చర్యలు

**దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం**

**మహిళా బిల్లుకు మా మద్దతు.. కానీ కుట్రలను సహించం**

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ**



**ఢిల్లీ, మహా:** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో 'అధికార చోరీ'కి పాల్పడేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేస్తూనే, ఆ బిల్లు అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనేది మంచి నిర్ణయమైనప్పటికీ, దానిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ విపక్షాలను, నిర్దిష్ట వర్గాలను అణచివేసేందుకు బీజేపీ యత్నిస్తోందని మండిపడ్డారు.

### బడుగు వర్గాల హక్కుల హరణే లక్ష్యం

ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కులను లాక్కునేందుకు బీజేపీ పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోందని రాహుల్‌గాంధీ విమర్శించారు. జనాభా గణనను చేపట్టకుండా, కేవలం రాజకీయ లెక్కలతో నియోజకవర్గాలను పునర్విభజించడం వల్ల బడుగు, బలహీన వర్గాల ప్రాతినిధ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది కేవలం సీట్ల పెంపు కాదు, బడుగు వర్గాల గొంతు నొక్కే ప్రయత్నం" అని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో అసలైన సామాజిక న్యాయం జరగాలంటే కుల గణన జరగాలని, అది లేకుండా చేసే డీలిమిటేషన్ ప్రక్రియలో పారదర్శకత ఉండదని స్పష్టం చేశారు. ఈ కుట్రలను అడ్డుకుని, అణగారిన వర్గాల హక్కుల కోసం కాంగ్రెస్ రాజీలేని పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు.

### దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం

ప్రతిపాదిత డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల చిన్న రాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలకు బహుమతి ఇవ్వాల్సింది పోయి, వాటి రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ఏంటని ఆయన నిలదీశారు. ఇది దేశ సమాఖ్య స్ఫూర్తికే విరుద్ధమని, భవిష్యత్తులో పార్లమెంటులో దక్షిణాది స్వరం బలహీనపడేలా బీజేపీ వ్యూహరచన చేస్తోందని ఆరోపించారు. భౌగోళిక విస్తీర్ణం, జనాభా ప్రాతిపదికన దక్షిణాదికి జరుగుతున్న అన్యాయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, అన్ని ప్రాంతీయ పార్టీలను ఏకం చేసి బీజేపీ ప్రయత్నాలను అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

### అధికార దాహంతోనే ఇవన్నీ..

మహిళా రిజర్వేషన్ల అమలును ఇన్నేళ్లు ఎందుకు ఆలస్యం చేశారని రాహుల్ కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇప్పుడు ఎన్నికల ముందు డీలిమిటేషన్ అంశాన్ని తెరపైకి తీసుకురావడం వెనుక అధికార దాహం తప్ప ప్రజల పట్ల ప్రేమ లేదని దుయ్యబట్టారు. బీజేపీ ఎత్తుగడలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థలను తన గుప్పిట్లోకి తీసుకోవాలని చూస్తున్న ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పార్లమెంటు లోపల, వెలుపల డీలిమిటేషన్ అంశంపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని, ప్రజల ఆస్తులను, హక్కులను కాపాడటమే తమ ప్రథమ కర్తవ్యమని రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు పాల్గొని రాహుల్ వ్యాఖ్యలకు మద్దతు పలికారు.

**ఫాతిమా ఓవైసీ కళాశాల కూల్చివేతకు**

# రంగం సిద్ధం?

(మొదటిపేజీ తరువాయి)

ఈ వివాదాస్పద కళాశాలలో కొత్తగా ఎటువంటి ప్రవేశాలు చేపట్టకూడదని గౌరవనీయ హైకోర్టు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని రాజా సింగ్ గుర్తు చేశారు. న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రవేశాలు కల్పిస్తే విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన విద్యాసంస్థల పట్ల ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు ఏ క్షణంలోనైనా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నందున, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు, తల్లిదండ్రులు తమ విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇటువంటి వివాదాస్పద సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని రాజా సింగ్ సూచించారు. అక్రమ నిర్మాణాల్లో నడుస్తున్న కళాశాలల్లో చేరి అనవసర చిక్కుల్లో పడకూడదని, తక్కువ ఫీజులు లేదా ఇతర ప్రలోభాలకు లోనై జీవితాలను పణంగా పెట్టవద్దని హితవు పలికారు. అనుమతులు లేని, వివాదాస్పద భూముల్లో ఉన్న విద్యాసంస్థల్లో ప్రవేశాలు తీసుకోవద్దని ఆయన బహిరంగంగా విజ్ఞప్తి చేశారు.

# యుద్ధం చాలా త్వరగానే ముగుస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం గ్యాలన్‌కు సగటున 4 డాలర్లకు కొంచెం ఎక్కువగా ఉన్న గ్యాస్ ధరలు, ఎన్నికల నాటికి చాలా తగ్గుతాయని ట్రంప్ అంచనా వేశారు. ముడి చమురు ధర బ్యారెల్‌కు దాదాపు 92 డాలర్లు ఉండటం పట్ల తాను సంతోషంగా ఉన్నానని, ఈ వార్ ముగియగానే ధరలు భారీగా పడిపోతాయని ఆయన చెప్పారు. పశ్చిమాసియా యుద్ధం చాలా త్వరగా ముగుస్తుందని తాను భావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇంధన ధరలపై తాను చేసిన వ్యాఖ్యలను మీడియాలో వక్రీకరించి చూపించారని అమెరికా ప్రెసిడెంట్ తెలిపారు. హర్మూజ్ జలసంధిని శాశ్వతంగా తెరుస్తామని, ఈ నిర్ణయం చైనాకు చాలా సంతోషాన్ని కలిగిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. చైనాతో సహా యావత్ ప్రపంచం కోసమే తాను ఈ నిర్ణయాన్ని తీసుకుంటున్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితి మళ్లీ ఎన్నడూ ఏర్పడదని తేల్చి చెప్పారు.

# తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్

(మొదటిపేజీ తరువాయి)

అయితే వచ్చే 3 రోజులు ఉష్ణోగ్రతలు క్రమంగా 1 నుంచి 2 డిగ్రీలు పెరిగే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ 3 రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్, ఖమ్మం, మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు వాతావరణ శాఖ రానున్న 3 రోజులకు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ జిల్లాల్లో గరిష్ఠంగా 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, నారాయణపేట, ఖమ్మం, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచాయని తెలిపింది. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే వడగాల్పులు వీచే అవకాశం ఉన్న జిల్లాలకు ముందస్తుగా ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రానున్న 3 రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం పూట అసలు బయటికి రావొద్దని హితవు పలికింది.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసు

- 'పైలట్'కు బిగుస్తున్న ఉచ్చు
- తెరపైకి దుబాయ్ లో చనిపోయిన కేదార్ కేసు
- డ్రగ్స్ ఓవర్‌డోస్‌తో చనిపోయిన వ్యక్తితో సంబంధాలు

**హైదరాబాద్, మహా :** సంచలనం రేపిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో విచారణ జరుపుతున్న సిట్ అధికారులకు సంచలన విషయాలు తెలుస్తున్నాయి. ఈ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పైలట్ రోహిత్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితులుగా అరెస్ట్ అయి జైలుకు వెళ్లిన పైలట్ రోహిత్ రెడ్డి ఆయన సోదరుడు రితేష్‌రెడ్డి మరిన్ని చిక్కుల్లో పడుతున్నారు. తాజాగా ఈ కేసులో మరో వ్యక్తి పేరును సిట్ అధికారులు ప్రస్తావించారు. కేదార్ అనే వ్యక్తి పేరు మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్‌లో తెరమీదికి వచ్చింది. గతేడాది దుబాయ్‌లో డ్రగ్స్ అధికంగా తీసుకోవడం వల్ల ఓవర్ డోస్‌తో కేదార్ ప్రాణాలు కోల్పోయాడు. అయితే ఆ కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు దగ్గరి సంబంధాలు ఉన్నట్లు తాజాగా పోలీసులు గుర్తించారు. కేదార్ కు రోహిత్ రెడ్డికి మధ్య అనేక ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు తేల్చారు. అదే సమయంలో చాలా మంది డ్రగ్ పార్టీ నిర్వాహకులకు కూడా అనేక సార్లు డబ్బులు పంపించినట్లు ఆధారాలున్నాయని పోలీసులు వివరించారు. రితేష్ రెడ్డి బ్యాంక్ అకౌంట్ నుంచి కేదార్‌కు రూ. 25 లక్షలు రోహిత్ రెడ్డి ట్రాన్సాక్షన్లు చేసినట్లు విచారణలో తేలింది. ఈ రూ.25 లక్షల ట్రాన్సాక్షన్ గురించి కూడా విచారణలో పైలట్ రోహిత్ రెడ్డి , రితేష్ రెడ్డి.. సరైన సమాధానాలు చెబుతున్నారని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఈ కేసులో నిందితుల కస్టడీ పొడిగింపు పిటిషన్‌లో తాజాగా ఈ అంశాలను పోలీసులు పేర్కొన్నారు. ఈ మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసును తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపిస్తోంది. రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ గౌతమ్ నేతృత్వంలో సిట్ అధికారులు.. నిందితులను విచారణ చేయడంతోపాటు.. ఈ కేసులో మరిన్ని విషయాలను బయటికి తీసుకు వస్తున్నారు. ఈ డ్రగ్స్ పార్టీతోపాటు.. ఆ పార్టీకి డ్రగ్స్‌ను సరఫరా చేసింది ఎవరు.. ఆ నెట్‌వర్క్ ఏంటి.. వారితో దుబాయ్‌కు ఉన్న సంబంధాలు ఏంటి అనేది కూడా సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తుండటంతో పోలీసులు కూడా ఆశ్చర్యపోతున్నారు. దుబాయ్ లో ఓవర్ డోస్ తో కేదార్ మరణించారు. అప్పట్లోనే ఆయన మరణంపై అనేక అనుమానాలు రేకెత్తాయి. తాజాగా పైలట్ కేసులో కేదార్ అంశం వెలుగులోకి రావడంతో మరింత ఆసక్తి నెలకొంది.

## ఖాకీలను నిలదీసిన గ్రామస్థులు

- యస్సై సాయికిషోర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్
- దమ్మపేట పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత
- గంటకు పైగా ఆందోళన చేసిన బాధితులు
- డియస్పీ సతీష్ కుమార్ హామీతో వెనుతిరిగిన గ్రామస్థులు
- పేకాట దాడిలో అమానుషంగా ప్రవర్తించారంటూ బాధితుల ఆరోపణ



**దమ్మపేట ,మహా :** పేకాట స్థావరాలపై దాడి చేసి పోలీసుల అదుపులోకి తీసుకున్న ఓ ఘటన స్థానికంగా దుమారం రేపింది. ఏకంగా స్టేషన్ యస్సై సాయికిషోర్ రెడ్డిని సస్పెండ్ చేయాలంటూ ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకునేలా పరిస్తితి లు గోచరించాయి. పోలీసు స్టేషన్ ఎదుట దాదాపుగా 100 మంది బాదితుల సమక్షంలో గంట సేపు పోలీసులకు ,బాదితుల కు వాగ్వివాదం చోటుచేసుకుంది. చిట్టచివరకు పాల్వంచ డియస్పీ సతీష్ కుమార్ చొరవతో ,ఆయన ఇచ్చిన హామీ మేరకు బాదితులు శాంతించారు.

**పూర్తి వివరాలను పరిశీలిస్తే......**

దమ్మపేట మండలంలో గంజాయి ,గుట్కా ,పేకాట,ఇసుక ,అక్రమ మట్టి రవాణా వంటి అసాంఘిక,చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపిన ఘనత యస్సై .సాయికిషోర్ రెడ్డికి దక్కింది. ఈ నేపద్యంలో గత రెండురోజుల క్రింద మండలంలోని దురదపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న కొందరు వ్యక్తులపై మెరుపుదాడులు చేసి చాకచక్యంగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి కొంత నగదు ,వాహనాలు స్వాధిన పరుచుకున్నారు. ఇంకొందరు పరారీలో ఉన్నట్లు మీడియా కు సమాచారాన్ని అందించి ,తద్వారా వెల్లడించారు. ఇంతవరకు సజావుగానే ఉంది. కానీ పేకాట కేసులో పట్టుబడిన వారిని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు చేయాల్సి ఉండగా వారిపై భౌతిక దాడులకు పాల్పడ్డారంటూ దురదపాడు కాలనీకి చెందిన కొందరు యువకులు దమ్మపేట పోలీసులను బుధవారం రోడ్డుపై నిలదీశారు. స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ,యస్సైను సస్పెండ్ చేయాలంటూ నినదించారు. అంతే కాకుండా పేకాట కేసులో లేని ఓ అనారోగ్య వ్యక్తి పై కూడా భౌతికంగా దాడి చేసి తీవ్ర మనస్థాపానికి గురి చేశారని బాదితులు ఆవేదన వ్యక్తంచేశారు. భౌతికంగా పోలీసులు ఎందుకు దాడి చేసారంటూ పోలీసులను ప్రశ్నించారు. వెంటనే యస్సై పై కేసున మోదు చేయాలని లేని పక్షంలో ఆందోళన ఉదృతంగా చేస్తామని హెచ్చరించారు. అశ్వారావుపేట సిఐ జోక్యం చేసుకొని బాదితుల కు నచ్చజెప్పే ప్రయత్నం విఫలం అయ్యింది. సమాచారం తెలుసుకున్న పాల్వంచ డియస్పీ సతీష్ కుమార్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ , ససేమిరా బాదితులు ఒప్పుకోలేదు. చివరకు యస్సై పై కేసు నమోదు చేస్తానని స్పష్టమైన హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా బాదితులు ఉపశమనం పొందారు. ఏది ఏమైనప్పటికీ మండలంలో సిఎం పర్యటన సమయంలో ఖాకీల పై నిరసన లు చేయడం పై సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి.

## జల మహోత్సవ వేడుకలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**భద్రాచలం మహా :** భద్రాచలం కొత్త మార్కెట్ నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాలికలో భాగంగా మిషన్ భగీరథ విభాగం ఆధ్వర్యంలో జల మహోత్సవ వేడుకలో హర్ ఘర్ జల్ నినాదంతో ప్రజలకి తాగునీరు అందజేయాలని తెలిపారు. మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా తాగునీటి సౌకర్యం అందే విధంగా మరియు వేసవికాలం కావడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండేవిధంగా అధికారులకు పలు సూచనలు చేసారు. నూతనంగా ఏర్పడిన సర్పంచులు మరియు వార్డు మెంబర్లు మీ ఏరియాలలో తాగునీటి సమస్యలు ఉంటే వెంటనే అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించవలసిందిగా తెలియజేశారు..ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ గారు, ఉపసర్పంచ్ రత్నం కవిత గారు , వార్డు సభ్యులు , మండల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల్లో "అరైవ్ అలైవ్" కార్యక్రమం - ఎస్సై మేడ ప్రసాద్

**రోడ్డు భద్రత పై అవగాహన అవసరం**



**బూర్గంపహాడ్ మహా :** తెలంగాణ ప్రభుత్వం, ప్రత్యేక ఆలోచనతో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రజల్లో అవగాహన కల్పించాలని ముఖ్య ఉద్దేశంతో "అరైవ్ అలైవ్" అనే కార్యక్రమంతో ముందుకు వచ్చింది ఈ క్రమంలో బూర్గంపహాడ్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, నేడు మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ మందా నాగరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేసే కార్యక్రమం చేశారు. రోడ్డు పై వెళ్ళే వాహన దారులను నిలిపి వారి వాహన పత్రాలను పరిశీలించారు, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక ఎస్ఐ మేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి అని, లైసెన్స్, వాహన పత్రాలు లేకుండా వాహనాలు నడపరాదు అని కోరారు. ఇంట్లో కుటుంబ సభ్యులతో పాటు గ్రామములో ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పించాలని కోరారు. ఈ రోడ్డు ప్రమాదాల నివారణ ఉద్యమమే "అరైవ్ అలైవ్" కార్యక్రమాలు అని, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రాణ నష్టాన్ని నివారించడం దీని ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. అరైవ్ అంటే ఇంట్లోనుండి ఎలాగ ప్రయాణంతో బయటకు వెళ్ళామో... అలైవ్ అంటే అదేవిధంగా ఇంటికి తిరిగి సురక్షితంగా రావడం అని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి mpdo జమలారెడ్డి మాట్లాడుతూ ప్రజలు అందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి అని,మీ ప్రయాణం సురక్షితంగా, ప్రాణాలతో గమ్యాన్ని చేరాలని, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో, ముఖ్యంగా వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వం చేస్తూనే ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో meo ఎదు సింహరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు నాయకులు, పలు శాఖల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి శైలో బంకర్ బాధితులకు పునరావాసం కల్పించాలి

- గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు వినతి
- శైలో బాధితులకు సత్వర పరిష్కారం చూపుతామని ఉప ముఖ్యమంత్రి వెల్లడి



**సత్తుపల్లి, మహా.** నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి లకు తమ గ్రామంలోని అంబేద్కర్ నగర్, బీసీ కాలనీలకు అతి సమీపాన నిర్మించి అక్కడి ప్రజల ఆరోగ్యాలకు అడ్డుకట్టగా మారిన సింగరేణి శైలో బంకర్ బారి నుండి కాలనీవాసులను కాపాడాలని, అంబేద్కర్ నగర్ బీసీ కాలనీల ప్రజలకు పునరావాసం ఏర్పాటుచేసి అక్కడి ప్రజల భావితరాలకు బ్రతికే హక్కును కల్పించాలని గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ వినతికి స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, శైలో బంకర్ సమస్యపై సింగరేణి అధికారులతో చర్చలు జరిపామని, కొద్ది రోజులలో స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సమక్షంలో శైలో బంకర్ బాధితులు తీపి కబురు వింటారని తెలిపారు. ఈ విషయంపై హర్షం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు ఉప ముఖ్యమంత్రిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరుకుళ్ళ అప్పారావు, నరుకుళ్ళ రవి, మారోజు నాగేశ్వరరావు, కొత్త సాంబయ్య, కిష్టపాటి కోటిరెడ్డి, మారోజు శ్రీను, పాలకుర్తి ప్రభాకర్, వాడపల్లి నాగమణి, వాడపల్లి అరుణ, మారోజు నాగరాజు, కిష్టపాటి రాఘవ రెడ్డి, శ్రీను రెడ్డి, నక్క వెంకటేశ్వర రావు, తాళ్ల నాగేంద్ర, మారోజు అశోక్ పాల్గొన్నారు.

## విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలి

**అవగాహనతోనే ప్రమాదాల నివారణ.. జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న “అరైవ్-అలైవ్” కార్యక్రమం సందర్భంగా బుధవారం పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. “రహదారుల భద్రత మన అందరి బాధ్యత” అనే నినాదంతో ప్రారంభమైన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ రహదారుల భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించడం అత్యంత కీలకమని అన్నారు. చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు రహదారి భద్రతపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు బంధువులు ఉపాధ్యాయులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలనే విషయాన్ని గుర్తు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జీబ్రా క్రాసింగ్ వినియోగం రోడ్డు నియమాల పాటింపు వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.పాఠశాలల్లో రోడ్డు భద్రతపై పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ప్రత్యేక అవగాహనా తరగతులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాలు పట్టణాల్లో ర్యాలీలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించాలన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. “అరైవ్-అలైవ్” కార్యక్రమం ద్వారా ప్రజల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధురవాణి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, కోఆర్డినేటర్ నాగశేఖరా శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అధికారులు స్థానికంగా ఉండాలి

- పార్టీలకతీతంగా అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా చూడాలి
- జీరో ఇసుక దందా కట్టడి చేయాలి
- పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్ మహా :** మండల స్థాయి అధికారులందరూ ఆయా మండలాలలో పనిచేసే మండలములోనే స్థానికంగా ఉండాలని పినపాక నియోజకవర్గం శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక లో వాసవి ఫంక్షన్ హాల్ లో బుధవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురి అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004 లో అప్పటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యే గా వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించామని అన్నారు. అప్పటిలోనే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. పార్టీలకతీతంగా ఇందిరమ్మ అర్హులైన నిరుపేదలకు అందించాలని ఇందిరమ్మ త్వరగా పూర్తిచేసే బాధ్యత అధికారులు తీసుకోవాలని అన్నారు. లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా టోకెన్లు జారీ చేసి సకాలంలో ఇల్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడంలో బిల్లుల జాప్యం జరగకుండా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల జాప్యం పైకరకగూడెం ఎంపీడీవో పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించిన ఇల్లు నిర్మాణం లో జాప్యం జరిగిన నేపద్యం లో ఆగ్రహం వ్యక్తం చేశారు

## సాత్వికను సన్మానించిన డివిజన్ ప్రజలు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** గురుకుల కళాశాలలో బైపిసి చదువుతున్న సాత్విక ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాలలో 991మార్కులు సాధించింది. అత్యధిక మార్కులు సాధించిన సాత్విక 58వ డివిజన్ లోని హనుమాన్ బస్తీకి రాష్ట్ర స్థాయిలో పేరు తీసుకొచ్చిన సందర్భంగా ఆమెను హనుమాన్ బస్తిలోని కమ్యూనిటీ హాల్లో ఘనంగా సన్మానించారు. సాత్విక కృషిని తల్లిదండ్రులైన సంతోష్‌బాబు రేణుకల ప్రోత్సాహంను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో 58వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ దావూద్, మాజీ కౌన్సిలర్ లు అంబులవేణు, వాస భారతి, బస్తీ పెద్దలు ఎండ సీతారాములు, పద్మ, రాజన్న , ఉపాధ్యాయుడు అమ్మ మహేష్, చింతల కనకయ్య, నగేష్, గట్టు వేణు, మహమ్మద్ నదీమ్, మొహమ్మద్ అజీమ్ పాషా, వెంకట్ స్థానికులు యువకులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

**జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి**



**జూలూరుపాడు, మహా:** రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూలూరుపాడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. మైనార్టీ తీరని వారు వాహనాలు నడపకూడదని తెలిపారు. రోడ్డు భద్రత పై మీ కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు. వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీ నరసయ్య, తహసిల్దార్ టి శ్రీనివాస్, ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంఈఓ బి జుంకీలాల్, ఎస్సై బి రవి, పోలీస్ సిబ్బంది తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన కూరగాయల సాగు చేసుకోవాలి



**నేలకొండపల్లి, మహా:** ఆరోగ్యవంతమైన కూరగాయల సాగు చేసుకోవాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం. రాధ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో బుధవారం రైతులకు నూరు శాతం రాయితీ కూరగాయల విత్తనాల మిని కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు....రైతులు వ్యవసాయం సాగులో భాగంగా కూరగాయాల సాగు ను ప్రోత్సాహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే విత్తనాలతో ఎలాంటి మందులు పిచికారి చేయకుండా సేంద్రియంతో కూరగాయలు పండించాలని సూచించారు. ఆకు కూరలను ఎక్కువగా సాగు చేసుకోవాలని సూచించారు. మండలంలోని రైతాంగం కు దాదాపు 200 మిని కిట్స్ ను అందించినట్లు తెలిపారుకావాల్సిన రైతులు వ్యవసాయ కార్యాలయం లో సంప్రందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ విస్తీరణాధికారి పి. వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ నిబంధనల ప్రకారం

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

- గడువులోపు పూర్తి చేయాలని ఆదేశాలు
- ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత వేగంపై ప్రత్యేక దృష్టి: జిల్లా కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేరకే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుందని గడువులోపు నిర్మాణ పనులను పూర్తి చేయాలని నాణ్యత ప్రమాణాలు వేగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సుజాత నగర్ మండలం మర్రి తండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 99 ఇళ్లకు అనుమతులు మంజూరు కాగా అందులో 65 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి నిర్మాణ నాణ్యత పనుల పురోగతిని సవివరంగా పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు జరిగిన వ్యయం ప్రభుత్వం నుండి విడుదలైన నిధులు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.లేబర్ చార్జీలు ఎంత అవుతున్నాయి అదనంగా లబ్ధిదారులు ఎంత మొత్తం వెచ్చిస్తున్నారు వంటి అంశాలపై ప్రశ్నించి సమగ్ర సమాచారం సేకరించారు. ఈ క్రమంలో మూడ్ మౌనిక, హాథీరాం, భూక్య అమల, భూక్య సునీత, భూక్య పంతులీ తదితర లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు.గ్రామంలో సుమారు 650 మంది జనాభా ఉండగా వారిలో అధిక సంఖ్యలో తాపీ మేస్త్రీలు ఉన్నారని కలెక్టర్ గమనించారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయానికి అదనంగా లబ్ధిదారులు స్వంతంగా పెట్టుబడి పెట్టి తామే స్వయంగా ఇళ్ల నిర్మాణంలో పాల్గొనడం ద్వారా లేబర్ ఖర్చులను తగ్గించుకుంటూ ఇళ్లను నిర్మించుకుంటున్న విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు నిబంధనల ప్రకారం జరుగుతోందో లేదో అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఇళ్ల విస్తీర్ణం నిర్మాణ పరిమాణాన్ని అధికారులతో టేప్‌తో కొలిపించి నిర్ధారించారు. ఎలాంటి నాణ్యత లోపాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, గృహ నిర్మాణ శాఖ ఏఈ లాల్ సాబ్, పంచాయతీ సెక్రటరీ విజయలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సారపాక సెంటర్‌లో వాహనాలపై పోలీసుల చలానాలు



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం పరిధిలోని సారపాక సెంటర్‌లో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తున్న వానదారులపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.నెంబర్ ప్లేట్ లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి, ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన పలువురు వాహనదారులపై చలానాలు విధించారు.పోలీసులు మాట్లాడుతూ, రోడ్డు భద్రత కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లైసెన్స్, వాహన పత్రాలు, నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని హెచ్చరించారు.ఇలాంటి తనిఖీలు తరచూ కొనసాగుతాయని, Starting పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వేతన ఒప్పందం జాప్యంపై తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కు వినతి



**బూర్గంపహాడ్ మహా :** 14వ వేతన ఒప్పందంలో జరుగుతున్న జాప్యం మరియు పత్రమలోని ఆందోళనకర పరిస్థితులను మరియు యాజమాన్యం వారి నిర్లక్ష్య ధోరణిని వివరిస్తూ తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీమతి పమేలా సత్పతి IAS హైదరాబాద్ గారికి వినతిపత్రం అందజేసి, వారు జోక్యం చేసుకొని కార్మికులకు ఆమోద్యయోగ్యమైన వేతన ఒప్పందాన్ని పూర్తి చేయాలని కోరిన INTUC మిత్ర పక్షాలు ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూ 13వ వేతన ఒప్పందంలోని సమస్యలను గాలికొదిలేసి, ఇప్పుడు 14వ వేతన ఒప్పంద వేళ TNTUC నాయకత్వం మళ్ళీ అబద్ధపు ప్రచారాలతో మన ముందుకు వస్తోంది ఎన్నికల్లో గెలవడానికి 22 వేలు సాధిస్తామని ప్రగల్భాలు పలికి, తీరా సమయం వచ్చేసరికి కేవలం 9 వేలు అని చెప్పడం వారి చేతగానితనానికి నిదర్శనం. ఇప్పుడు యాజమాన్యం ఒప్పుకోవడం లేదని, నష్టాల్లో ఉందని కుంటిసాకులు చెబుతూ కార్మికుల తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇంత జరుగుతున్నా యాజమాన్యం కళ్ళు మూసుకుని కూర్చోవడమే కాకుండా, వీరికి వత్తాసు పలుకుతూ 18 నెలల క్రితం TNTUC నీ గెలిపించటానికి దొంగ జాబ్ నోటిఫికేషన్ ఇచ్చి ఇప్పటికీ పూర్తి చేయకుండా బదిలీ మరియు కాంట్రాక్ట్ కార్మికులను నట్టేట ముంచుతోంది. మన కాంట్రాక్ట్ సోదరులు ఇప్పటికే సమ్మె నోటీసులు ఇచ్చి యుద్ధానికి సిద్ధమయ్యారు.ఈ అరాచకాలను ఇక భరించేది లేదు! ఈ రోజే రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్' గారిని కలిసి, యాజమాన్యం మరియు RU నాయకుల కుమ్మక్కు రాజకీయాలను బట్టబయలు చేస్తూ ఫిర్యాదు చేశాం. వారిని గట్టిగా మందలించి, కార్మికులందరికీ తక్షణమే న్యాయం చేయాలని వారికి సమగ్రహంగా వివరించడం జరిగింది అన్నారు దీని గురించి స్పందించిన వారు త్వరలోనే యాజమాన్యంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు ఈ సందర్భంగా కార్మికులందరికీ తెలియజేయునది ఏమనగా న్యాయం జరిగే వరకు ఐ ఎన్ టి యు సి పోరాటం ఆగదుఅని మోసపూరిత నాయకులను తరిమి కొట్టి మన హక్కులను సాధించుకునేందుకు కార్మికులు ఏకం కావాలన్నారు

## కాకర్లపల్లి ఎన్టీఆర్ కాలువను పూడ్పించి పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

**సిపిఐ (ఎం ) సత్తుపల్లి మండల కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్**


**సత్తుపల్లి, మహా:** నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవిన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి లకు ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ వేంసూరు మండలానికి నీరు అందించడానికి 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాలువ ప్రస్తుతం నిరుపయోగంగా ఉందని, ఆ కాలువను స్థానిక సింగరేణి సంస్థలు సంప్రదించి మట్టితో పూడ్చి ఇల్లు లేని పేదల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇల్లు లేని పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు కాపురాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు కావలసినంత ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ ఇళ్ల స్థలాలు పంచడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీ సమీపంలో కాలనీవాసుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్న సింగరేణి శైలో బంకర్ ను తక్షణమే తొలగించాలని, అది వీలుకాని పక్షంలో కాలనీవాసులకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో ఆగిపోయిన లైబ్రరీ, రీడింగ్ రూమ్ లు (కమ్యూనిటీ హాల్ ) తిరిగి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, బండి వేలాద్రి, బాల బుచ్చయ్య, దాట్ల రాంబాబు, బెజవాడ కృష్ణవేణి, ఆంగోతి చిట్టెమ్మ, తడికమళ్ళ రామకృష్ణ, కిష్ట లక్ష్మి, పరిమి సీతామహాలక్ష్మి, బెజవాడ లక్ష్మీనారాయణ, కొప్పుల చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | గురువారం, తిరుపతి | 16-04-2026
ANN తెలుగు

# మహేశ్ బాబు సోదరుడి కుమారుడి మూవీ.. టీజర్ రిలీజ్



ఆర్ఎక్స్ 100, మంగళవారం చిత్రాల ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న ఇంటెన్స్ లవ్ డ్రామా 'శ్రీనివాస మంగాపురం'. ఈ మూవీతో సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, దివంగత నటుడు రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రం ద్వారా బాలీవుడ్ నటి రషా తడాని తెలుగులో హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తోంది. ఈ మూవీని చందమామ కథలు బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు కూడా ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇవాళ విడుదలైన టీజర్ చూస్తుంటే ఈ మూవీ ప్రేమకథా చిత్రంగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. మోహన్ బాబు లుక్ చూస్తుంటే విలన్‌గా అలరించనున్నట్లు అర్థమవుతోంది. ఈ మూవీని తిరుపతి నేపథ్యంలో రూపొందించారు. టీజర్‌లో డైలాగ్స్, ఫైట్ సీన్స్ రాయలసీమ బ్యాక్ డ్రాప్‌లో కథ ఉండనున్నట్లు క్లియర్‌గా కనిపిస్తోంది. కాగా.. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందిస్తున్నారు.




## అనుకున్నదే అయింది.. ట్విస్ట్ తో రాంచరణ్ పెద్ది రిలీజ్ వాయిదా..!

ఉప్పెన ఫేం బుచ్చి బాబు సాన దర్శకత్వంలో రాంచరణ్ (Ram Charan) టైటిల్ రోల్‌లో నటిస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ మూవీ పెద్ది (Peddi). స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ డ్రామా గా వస్తోన్న పెద్ది నుంచి ఇప్పటికే విడుదల చేసిన చికిరి చికిరి సాంగ్ ఇండియాతోపాటు సెకండ్ సింగిల్ 'రై రై రా రా' సాంగ్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. పెద్ది ఏప్రిల్ 30న 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుందని ముందుగా ప్రకటించారని తెలిసిందే. ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయంటూ ఇప్పటికే నెట్టింట వార్తలు హల్‌చల్ చేస్తూనే ఉన్నాయి. ఇప్పుడవే నిజమయ్యాయి. పెద్ది ఏప్రిల్ 30న రావడం లేదని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అంతేకాదు పెద్ది జూన్ లో ప్రేక్షకుల ముందుకొస్తుందని ప్రకటించారు. అయితే ఈ సారి మరో ట్విస్ట్ ఇస్తూ రిలీజ్ డేట్ ఎప్పుడనేది మాత్రం సస్పెన్స్‌లో పెట్టేశారు. సాంగ్ మినహా షూటింగ్ మొత్తం పూర్తయిందని, అవుట్ ఫుట్ పూర్తిగా సంతృప్తికరంగా వచ్చిందని మేకర్స్ వెల్లడించారు. తాజా వాయిదాతో మేకర్స్‌కు మరింత సమయం రానుండటంతో పోస్ట్ ప్రొడక్షన్ పనులపై మరింత ఫోకస్ పెట్టే అవకాశం దొరికిందన్నమాట. పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పెద్ది చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి.

## చరిత్ర సృష్టించిన రణవీర్ సింగ్ 'ధురంధర్'..

### రూ. 3,000 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి భారతీయ సినిమాగా రికార్డు



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్' (Dhurandhar) ఫ్రాంచైజీ భారతీయ చలనచిత్ర పరిశ్రమలో సరికొత్త చరిత్రను సృష్టించింది. కేవలం రెండు భాగాలతోనే ఈ సిరీస్ ప్రపంచవ్యాప్తంగా రూ. 3,000 కోట్ల వసూళ్ల మార్కును దాటి, ఈ ఘనత సాధించిన మొట్టమొదటి ఇండియన్ ఫిల్మ్ ఫ్రాంచైజీగా నిలిచింది. జియో స్టూడియోస్ మరియు B62 స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించింది. ధురంధర్ పార్ట్ 1 డిసెంబర్ 5, 2025న విడుదలైన మొదటి భాగం 'ధురంధర్' అంచనాలను మించి దూసుకుపోయిన సంగతి తెలిసిందే. హిందీ బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ. 840 కోట్లకు పైగా నెట్ వసూళ్లను సాధించి, ప్రపంచవ్యాప్తంగా రూ. 1,300 కోట్లకు పైగా గ్రాస్‌ను రాబట్టింది. తద్వారా భారత్ నుంచి అత్యధిక వసూళ్లు సాధించిన నాలుగో చిత్రంగా నిలిచి, ఫ్రాంచైజీకి బలమైన పునాది వేసింది.

### ధురంధర్ 2

మొదటి భాగం విడుదలైన కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే వచ్చిన 'ధురంధర్ 2: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద విశ్వరూపం చూపించింది. రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1,700 కోట్లకు పైగా వసూలు చేసింది. అంతేకాకుండా, ఒకే భాషలో (హిందీ) రూ. 1,000 కోట్ల నెట్ వసూళ్లు సాధించిన తొలి భారతీయ చిత్రంగా రికార్డు సృష్టించింది. దీంతో ఈ రెండు చిత్రాల ఉమ్మడి వసూళ్లు ఇప్పుడు రూ. 3,000 కోట్ల మైలురాయిని చేరుకున్నాయి. అయితే ఒకే ఫ్రాంచైజీలో రూ.3000 కోట్లు రాబట్టిన మొదటి చిత్రంగా ధురంధర్ చరిత్ర సృష్టించింది. ఈ చిత్రంలో రణవీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, ఆర్. మాధవన్, సారా అర్జున్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం నటించారు. దేశభక్తి మరియు హై-వోల్టేజ్ యాక్షన్ కలయికతో తెరకెక్కిన ఈ ఫ్రాంచైజీ, గ్లోబల్ స్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటిచెప్పింది.




## తమిళ స్టార్ హీరో ధనుష్‌కి జోడీగా రుక్మిణి!

కన్నడ భామ రుక్మిణి వసంత్‌కి తమిళంలో అవకాశాలు క్యూ కడుతున్నాయి. నటుడు విజయ్ సేతుపతికి జంటగా 'ఏస్' మూవీతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈమెకు ఇది హిట్ అవ్వకపోయినా ఛాన్సులు వరిస్తున్నాయి. శివకార్తికేయన్‌కి జంటగా గతేడాది 'మదరాసి' చిత్రంలో నటించింది. ఇది కూడా జస్ట్ ఓకే అనిపించుకుంది. ఆ తర్వాత సొంత భాషలో చేసిన 'కాంతార' ప్రీక్వెల్ మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇప్పుడు ధనుష్‌కు జంటగా నటించే అవకాశం వరించిందని సమాచారం. ధనుష్ ప్రస్తుతం విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో చేసిన 'కర' మూవీ విడుదలకు సిద్ధమైంది. దీని తర్వాత 'అమరన్' ఫేమ్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో నటిస్తాడు. ఇది ధనుష్ 55వ చిత్రం. దీని తర్వాత మారి సెల్వరాజ్ దర్శకత్వంలో చేయనున్నాడు. 'లబ్బర్ పందు' ఫేమ్ తమిళరస పద్యముత్తు దర్శకత్వంలో మరో చిత్రం చేయడానికి కమిట్ అయ్యాడ. ఇందులోనే ఈయనకు జంటగా రుక్మిణి వసంత్‌ని హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు సమచారం. రుక్మిణి.. కన్నడ, తమిళంతో పాటు తెలుగులోనూ ఎంట్రీ ఇచ్చారు. తెలుగులో జూనియర్ ఎన్టీఆర్‌కు జంటగా 'డ్రాగన్' చేస్తున్నారు. కన్నడంలో చేసిన 'టాక్సిక్' చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఇకపోతే ధనుష్ తో నటి రుక్మిణి తొలిసారిగా జోడీ కట్టబోతోందన్న మాట. ఇందులో విజయ్ కుమార్ ప్రతినాయకుడిగా నటించనున్నారనీ టాక్. త్వరలోనే ఈ విషయాలపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది.

## లోతైన మనోవిశ్లేషణ టాక్సిక్

'ఈ ప్రపంచంలో ప్రతీ వంద కిలోమీటర్లకు భాష, సంస్కృతి, సంప్రదాయాలు వేరుగా ఉంటాయి. అయితే 'టాక్సిక్' కథాంశం మాత్రం అందరికి కనెక్ట్ అవుతుంది. లోతైన మనోవిశ్లేషణతో మనల్ని మనం తెరపై చూసుకున్న అనుభూతినిస్తుంది' అన్నారు చిత్ర కథానాయకుడు యశ్. ఆయన తాజా చిత్రం 'టాక్సిక్' జూన్ 4న ప్రేక్షకుల ముందుకురాబోతున్నది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. లాస్ వెగాస్‌లో నిర్వహించిన సినిమా కాన్ 2026 కార్యక్రమంలో హీరో యశ్ సందడి చేశారు. 'టాక్సిక్' సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. "టాక్సిక్' కథలో చాలా లేయర్స్ ఉంటాయి. పైకి చూస్తుంటే ఇదొక రెగ్యులర్ యాక్షన్, గ్యాంగ్‌స్టర్ మూవీలా అనిపిస్తుంది. కానీ లోతైన మనోవిశ్లేషణతో మానవ సంబంధాలను నిర్వచిస్తుంది. ఓ డార్క్ క్యారెక్టర్‌ను చాలా గొప్పగా చూపించారు. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ గ్యాంగ్‌స్టర్ చిత్రాలకు చిరునామాలా తీర్చిదిద్దారు. ఆడియన్స్ సైకాలజీ మీద ఈ సినిమా చాలా ప్రభావం చూపిస్తుంది' అని యశ్ తెలిపారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా తదితరులు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు.



## సమ్మర్ వెకేషన్‌లా అనిపిస్తుంది

నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ కేఏ ప్రొడక్షన్స్ పతాకంపై కిరణ్ అబ్బవరం నిర్మిస్తున్న చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. సాయితేజ్, వేద జలంధర్ హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు. ముని దర్శకుడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడిక్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సినిమా మంచి సమ్మర్ వెకేషన్‌లా అనిపిస్తుందని, తిమ్మరాజుపల్లి అనే ఊరిలో జరిగిన సంఘటనల నేపథ్యంలో వినోదం, థ్రిల్లింగ్ అంశాలతో మెప్పిస్తుందని, చిన్న బడ్జెట్‌లో ఇంత క్వాలిటీగా సినిమా చేయొచ్చా అని అందరూ ఆశ్చర్యపోతారని కిరణ్ అబ్బవరం అన్నారు. చిన్న చిత్రాల్లో ఈ సినిమా ఓ బెంచ్ మార్క్ క్రియేట్ చేయబోతున్నదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ నేపథ్యంలో ఆహ్లాదభరిత కథాంశంతో అందరికి నచ్చే చిత్రమిదని దర్శకుడు వి.మునిరాజు అన్నారు. కొత్తవారైనా నటీనటులందరూ అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచారని ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ ప్రశంసించారు.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034